సాక్షి జగిత్యాల

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



ఘనంగా బతుకమ్మ వేడుక

జిల్లాలో గురువారం కూడా బతుకమ్మ వేడుకలు జరిగాయి. మహిళలు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. 11లో▸



ఇక్కడి పైసలు ఇక్కడ్నే ఖర్చు చేయాలే

అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలు సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించాలని కార్మిక సంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. 10లో▸

గరిష్టం/కనిష్టం 31.0/22.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం నుంచి చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ఈవీఎంల వద్ద అప్రమత్తంగా ఉండాలి



రాయపట్నం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలను పరిశీలిస్తున్న ఎస్పీ

ధర్మపురి: ఈవీఎంలు భద్రపర్చిన కంట్రోల్ రూంల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సీఐ, ఎస్సైలను ఆదేశించారు. ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం సందర్శించి ఈవీఎంలు భద్రపర్చిన గదులను పరిశీలించారు. కళాశాల పరిసరాలు, వసతులు, సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషిచేయాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం రాయపట్నం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును సందర్శించారు. చెక్‌పోస్టు వద్ద నిత్యం చేపడుతున్న తనిఖీల రికార్డు, రిజిస్టర్లను పరిశీలించారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలని, రూ.50వేలకు మించి నగదు ఉంటే స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

రాయపట్నం వద్ద 10.17 లక్షలు పట్టివేత

రాయపట్నం చెక్‌పోస్టు వద్ద 24 గంటల్లో రూ.10.17 లక్షలు పట్టుకున్నారు. 190.25 లీటర్ల లిక్కర్, రూ.1.44 లక్షల విలువైన 72 బ్యాటరీ స్ప్రేలను పట్టుకుని గీవెన్స్ టీంకు అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డీఎస్పీ ఎస్పీ రవీంద్రకుమార్, సీఐ రమణామూర్తి, ఎస్సైలు దత్తాత్రి, రామకృష్ణ, సిబ్బంది తదితరులున్నారు.

'అల్పాహారం' ప్రారంభం



అల్పాహారం చేస్తున్న విద్యార్థులు

జగిత్యాలరూరల్: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అల్పాహారం కార్యక్రమాన్ని గురువారం జగిత్యాలరూరల్ మండలం పొరండ్ల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రారంభించారు. సర్పంచ్ పొగ్గళ్ల సంధ్యారాణి, ప్రధానోపాధ్యాయుడు ఎన్నం రాంరెడ్డి పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

జగిత్యాలక్రైం: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు మెగా రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వీరూపాక్షి గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమానికి రక్తదాతలు హాజరు కావాలని కోరారు.

కాలినడకన శబరిమలకు..



శబరిమలకు బయల్దేరి వెళ్తున్న అయ్యప్ప భక్తులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి, కొజన్‌కొత్తూర్ నుంచి అయ్యప్ప దీక్ష స్వాములు శబరిమలకు పాదయాత్రగా గురువారం బయల్దేరి వెళ్లారు. ఎర్దండికి చెందిన బెల్లాల రమేశ్, బాసెట్టి రాజేందర్, కొజన్‌కొత్తూర్‌కు చెందిన ఎర్రోళ్ల రమేశ్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుని 41 రోజుల పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. శబరిమలకు చేరుకుని స్వామివారిని దర్శనం చేసుకోనున్నట్లు తెలిపారు.

రాయికల్ నుంచి..

రాయికల్: పట్టణానికి చెందిన మోర శైలేశ్ శబరిమలకు గురువారం మహాపాదయాత్రగా బయల్దేరారు. గురుస్వాములు మచ్చ శ్రీధర్, ఎలిగేటి సత్యనారాయణ, మోర శరత్, తదితరులు ఉన్నారు.

కార్మికుల ఆర్థిక ఇబ్బందులు తొలగించాలి

జగిత్యాల: బీడీ కార్మికులను కమీషన్ ఏజెంట్లు ఇష్టానుసారంగా దోచుకుంటున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి సురేశ్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ లేబర్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందించారు. బీడీ కార్మికులకు కొత్త పీఎఫ్ నంబరు ఇవ్వడానికి రూ.5వేల వరకు డిమాండ్ చేస్తున్నారని, వెయ్యి బీడీలకు రూ.232 ఇవ్వాల్సి ఉండగా, రూ.222 ఇచ్చేలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

మూడు జిల్లాల మానకొండూర్

జంగ్ తెలంగాణ

- 2009లో నియోజకవర్గం ఆవిర్భావం
- బరిలో పాతకాపులే.. ప్రధాన పార్టీల మధ్యే పోటీ
- తొలిసారి ఆరెపల్లి, రెండుసార్లు రసమయి విజయం
- మూడోసారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్న 'కవ్వంపల్లి'!



మానకొండూర్: డీలిమిటేషన్‌లో భాగంగా 2009లో నేరెళ్ల, ఇందుర్తి, కమలాపూర్, హుజూరాబాద్, కరీంనగర్ మండలాల్లోని పలు గ్రామాలతో మానకొండూర్ నియోజకవర్గం ఏర్పడింది. ప్రస్తుతం సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్ మూడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. ఇప్పటివరకు మూడుసార్లు ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగగా, తొలిసారి కాంగ్రెస్, తర్వాత రెండుసార్లు టీఆర్‌ఎస్ విజయం సాధించాయి. నాలుగోసారి సైతం పాతకాపులే ఎన్నికల బరిలో దిగనున్నారు. ప్రతిసారీ గట్టి పోటీ ఉంటోంది.

జలవనరులు పుష్కలం..

నియోజకవర్గంలో జలవనరులు పుష్కలంగా ఉన్నాయి. ఇల్లంతకుంట మండలంలోని అనంతసాగర్(అన్నపూర్ణ) ప్రాజెక్టు ద్వారా ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాలకు సాగునీరు అందుతోంది. మిడ్‌మానేరు, దిగువ మానేరు, తోటపల్లి, కల్వల రిజర్వాయర్ల ద్వారా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సాగు నీరు వెళ్తోంది. కరీంనగర్ జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా ఈ నియోజవర్గంలో ప్రాజెక్టులు ఉన్నాయి. ఒకప్పుడు ఏడారిగా ఉన్న ఇల్లంతకుంట, బెజ్జంకి, గన్నేరువరం మండలాలు నేడు నీటితో కళకళలాడుతున్నాయి. తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల్లోని మెట్ట ప్రాంతానికి ఈ ప్రాజెక్టులతో సాగు నీరు అందుతుండటంతో నియోజకవర్గం పాడి పంటలతో విలసిల్లుతోంది. ఇంజినీరింగ్ తదితర కళాశాలలతో విద్యార్థులకు ఉన్నత చదువులు అందుబాటులోకి వచ్చాయి. వరి సీడ్ పాంట్లు జిల్లాలోనే మానకొండూర్, శంకరపట్నం మండలాల్లో అధికంగా ఉన్నాయి.

కాంగ్రెస్ నుంచి 'కవ్వంపల్లి'

కవ్వంపల్లి సత్యనారాయణ 2009లో పీఆర్పీ తరఫున పోటీ చేసి, 34,430 ఓట్లు, 2014లో టీడీపీ నుంచి పోటీ చేసి, 23,627 ఓట్లు సాధించారు. 2018లో పోటీ చేయలేదు. ఈసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేయనున్నారు.

సంవత్సరం	అభ్యర్థి	పోలైన ఓట్లు	ప్రత్యర్థి	పోలైన ఓట్లు
2009	ఆరెపల్లి మోహన్ (కాంగ్రెస్)	45,304	ఓరుగంటి ఆనంద్(టీఆర్‌ఎస్)	43,132
2014	రసమయి బాలకిషన్ (టీఆర్‌ఎస్)	85,010	ఆరెపల్లి మోహన్(కాంగ్రెస్)	38,088
2018	రసమయి బాలకిషన్(టీఆర్‌ఎస్)	88,997	ఆరెపల్లి మోహన్(కాంగ్రెస్)	57488

ఓటర్ల వివరాలు

పోలింగ్ బూత్‌లు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జండర్	మొత్తం ఓటర్లు
316	1,07,371	1,11,041	1	2,18,413

రెండుసార్లు రసమయిదే విజయం

2009లో కాంగ్రెస్ తరఫున ఆరెపల్లి మోహన్, టీఆర్‌ఎస్ తరఫున ఓరుగంటి ఆనంద్, పీఆర్పీ అభ్యర్థిగా కవ్వంపల్లి సత్యనారాయణ ఎన్నికల బరిలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి టీఆర్‌ఎస్ అభ్యర్థిపై విజయం సాధించారు. 2014లో టీఆర్‌ఎస్ నుంచి రసమయి బాలకిషన్, కాంగ్రెస్ నుంచి ఆరెపల్లి మోహన్, టీడీపీ నుంచి కవ్వంపల్లి సత్యనారాయణ పోటీలో ఉన్నారు. టీఆర్‌ఎస్ అభ్యర్థి కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందారు. 2018లో టీఆర్‌ఎస్ నుంచి రసమయి బాలకిషన్, కాంగ్రెస్ నుంచి ఆరెపల్లి మోహన్ పోటీ పడ్డారు. ఈ ఎన్నికలు నువ్వా నేనా అన్నట్లు సాగగా రసమయి రెండోసారీ గెలిచారు. 2009లో పీఆర్పీ తరఫున, 2014లో టీడీపీ తరఫున పోటీ చేసిన కవ్వంపల్లి సత్యనారాయణ గట్టి పోటీ ఇచ్చి, ఓటమిపాలయ్యారు. 2018లో టీడీపీ, కాంగ్రెస్ పొత్తులో భాగంగా మానకొండూర్ సీటు కాంగ్రెస్‌కు కేటాయించడంతో సత్యనారాయణ ఆ పార్టీకి మద్దతు తెలిపారు.

'ఆరెపల్లి' ఈసారి బీజేపీ నుంచి

మొదటినుంచీ కాంగ్రెస్‌లో ఉన్న ఆరెపల్లి మోహన్ గత ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుతం బీజేపీలో చేరి, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే, డాక్టర్ వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చిన కవ్వంపల్లి సత్యనారాయణ 2009కి ముందు కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ నుంచి టికెట్ రాకపోవడంతో పీఆర్పీ నుంచి పోటీ చేసి, ఓటమి చెందాడు. ఆ తర్వాత 2014లో టీడీపీ నుంచి పోటీ చేసినా ఓడిపోయారు. తదనంతర రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి, మూడోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.



బలాలు.. బలహీనతలు నాయకులకు తెలుసు. మంచి నాయకుడు బలహీనతలు వదిలేస్తాడు. బలాలను పెంచుకుంటాడు.
– వారెన్ బెన్నిస్

మీకు తెలుసా?

ఓటు.. రకాలు



కరీంనగర్ అర్బన్: ఓటు వినియోగం సాధారణంగా అందరికీ ఒకే మాదిరిగా ఉంటుంది. కానీ అదే ఓటును కొన్ని సమయాల్లో వేరే పేర్లతో పిలుస్తారు. ఓటు వేసే సమయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు కొన్ని ఓట్లను ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. అంధులకు, చాలెంజ్, టెండర్, సర్వీస్ ఓటు ఇలా వినియోగించే అవకాశముంది.

టెండర్ ఓటు : ఎవరైనా వ్యక్తి ఓటు వేయడానికి వచ్చినప్పుడు అతడి ఓటు ఇంతకుముందే మరొకరు వేసినట్లయితే ప్రిసైడింగ్ అధికారి అతడికి బ్యాలెట్ ఓటు ఇచ్చి వేయించాలి. దీన్ని టెండర్ ఓటుగా పిలుస్తారు. ఈ సమాచారాన్ని ఫారం –17బీలో నమోదు చేయాలి.

సర్వీస్ ఓటు: ఎవరైనా సర్వీసు ఓటర్లు తమకు సంబంధించిన వ్యక్తుల ద్వారా ఓటు వేయడానికి ఎన్నికల అధికారుల ద్వారా ముందస్తు అనుమతి తీసుకుంటే వారి పేర్లు క్లాసిఫైడ్ సర్వీస్ ఓటరు లిస్ట్‌లో ఉంటుంది. అలాంటి వ్యక్తి ఓటు వేయడానికి వస్తే జాబితాలో చూసుకుని సాధారణ ఓటరు మాదిరి అతడికి ఓటు హక్కు కల్పిస్తారు.

చాలెంజ్ ఓటు: ఓటరు ఎవరైనా ఓటు వేయడానికి వచ్చినప్పుడు ఎన్నికల ఏజెంట్లు ఆ ఓటరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తే సంబంధిత ఎన్నికల అధికారి ఫిర్యాదు చేసిన వ్యక్తి నుంచి రూ.2 రుసుం తీసుకుని రసీదు ఇస్తారు. వచ్చిన ఓటరు నిజమైనవారా, కాదా అని విచారిస్తారు. నిజమైన వారని తేలితే అతడికి ఓటు హక్కు కల్పించి రూ.2 రుసుంను జప్తు చేస్తారు. అతను నిజమైన వారు కాదని తేలితే ఓటరు నుంచి రూ.2 తీసుకుని ఏజెంట్‌కు అందించి ఓటు వేసేందుకు అనర్హుడిగా ప్రకటిస్తారు.

ఈడీసీ ఓటు: ఎన్నికల సిబ్బంది ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్(ఈడీసీ) కలిగి ఉంటే అతడి వివరాలు మార్క్‌డ్ కాపీలో చివర నమోదు చేస్తారు. సాధారణ ఓటరు మాదిరి ఓటింగ్ సౌకర్యం కల్పిస్తారు.

టెస్ట్: ఓటరు ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి ఓటు వేసిన తర్వాత వీవీప్యాట్ నుంచి వచ్చే స్లిప్‌లో తాను ఓటు వేసిన వ్యక్తికి పడలేదని తెలిపితే రాత పూర్వకంగా ఫిర్యాదు తీసుకుంటారు. అతనికి మరోసారి బ్యాలెట్ ఇస్తారు. ఓటు వేసేందుకు మరోసారి వెళ్లేటప్పుడు అతనితోపాటు పోలింగ్ ఏజెంట్‌ను తీసుకెళ్లి వారి సమక్షంలో ఓటు వేయిస్తారు. వేసిన ఓటుకు వచ్చిన స్లిపు తేడా ఉంటే ఆర్‌వోకు సమాచారం ఇచ్చి ఓటింగ్ ప్రక్రియ నిలిపివేస్తారు. వేసిన ఓటుకు వీవీప్యాట్‌లో వచ్చిన స్లిప్‌కు తేడా లేకుంటే ఆ సమాచారాన్ని 17 సీలో నమోదు చేయడంతోపాటు ఏ అభ్యర్థికి ఓటు రికార్డు చేశారనే విషయాన్ని స్పష్టంగా రాస్తారు.

నాట్ టు ఓటు: ఒక వ్యక్తి పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించి బ్యాలెట్ ఇచ్చిన తర్వాత ఓటు వేయనని అంటే అతని కోరిక మేరకు పీవో అతడిని బయటకు పంపిస్తారు. నాట్–టు–ఓటు అని రాసి ఆ ఓటును వేరే ఓటరుకు ఇస్తారు.



సమాజంలో రెండు వర్గాలు ఉంటాయి. ఒక వర్గం పనిచేసే వారైతే.. మరొక వర్గం పేరు కోసం తపించేవారు. మొదటి వర్గం వైపు ఉండడం ఉత్తమం.
– ఇందిరాగాంధీ

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

- జిల్లాలో 398 కొనుగోలు కేంద్రాలు
- మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,203
- పీఏసీఎస్ నుంచి 271 కేంద్రాలు
- ఐకేపీ ద్వారా 126..
- మెప్మా ఆధ్వర్యంలో ఒక కేంద్రం ఏర్పాటు



జగిత్యాలఅగ్రికల్చర్/జగిత్యాల రూరల్: వానాకాలం సీజన్‌లో పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం నడుం బిగించింది. రైతులకు ఇబ్బంది కలగకుండా. కొనుగోళ్లు సాఫీగా సాగేలా కలెక్టర్ యాస్మిన్‌బాషా ఆదేశాల మేరకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

జిల్లాలో 398 కేంద్రాలు

జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 398 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఐకేపీ తరఫున 126 కేంద్రాలు, పీఏసీఎస్ (సహకార సంఘాలు) తరఫున 271 కేంద్రాలు, మెప్మా తరఫున ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధరగా గ్రేడ్‌– ఏ రకం క్వింటాల్‌కు రూ.2203, కామన్ రకం క్వింటాల్‌కు రూ.2,183 చొప్పున చెల్లించనున్నారు. వాస్తవానికి జిల్లాలో 360 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లా వ్యవసాయ ఆధారితం కావడం.. వరి విస్తీర్ణం పెరగడంతో గ్రామాలను మించి ఇక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

3.05లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో వరి 3.05లక్షల ఎకరాల్లో వానాకాలం సీజన్‌లో రైతులు సాగు చేశారు. ఇందులో 30 శాతం సన్నరకం ధాన్యం సాగుచేశారు. సన్నరకాన్ని రైతులు నేరుగా బియ్యంగా మార్చడం.. లేదా మిల్లర్లకు, స్థానిక వ్యాపారులకు విక్రయించడం చేస్తుంటారు. మిగిలిన దాదాపు 70 శాతం (2.10 లక్షల ఎకరాల్లో) వరకు దొడ్డురకం సాగైంది. ఈ సారి పెద్దగా తెగుళ్లు, పురుగులు లేక అనువైన వాతావరణం ఉండటంతో ఎకరాకు సగటున 28 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన ఈ సీజన్‌లో జిల్లాలో దొడ్డురకం ధాన్యం 6 లక్షల టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

సమస్యలు పునరావృతం కాకుండా..

ధాన్యం కొనుగోళ్లలో గతంలో ఏర్పడిన సమస్యలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే కలెక్టర్ యాస్మిన్‌బాషా, అడిషనల్ కలెక్టర్ లత ప్రభుత్వ ఆదేశాల మేరకు సివిల్ సప్‌లై, డీఆర్‌డీఏ, సింగిల్ విండో, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులతో సమీక్షించారు. కొనుగోళ్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధాన్యం కొనుగోలు నిర్వాహకులతో జిల్లా స్థాయిలో అవగాహన కల్పించనున్నారు. గన్నీ సంచులకు కొరత లేకుండా.. ఎప్పటికప్పుడు తెప్పించేలా ఏర్పాట్లు చేయనున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించేలా లారీ ట్రాన్స్‌పోర్టు యజమానులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలం కావడం.. పగటి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉండడంతో పూర్తి స్థాయిలో ఆరబెట్టిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు అవగాహన కల్పించేలా గ్రామస్థాయి అధికారులకు ఆదేశాలు అందాయి.

జిల్లా అధికారులతో మానిటరింగ్ బృందాలు

జిల్లాస్థాయిలో ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఉండేందుకు జిల్లా స్థాయి అధికారులతో మానిటరింగ్ బృందాలు ఏర్పాటు చేయనున్నారు. దీనికి తోడు, ఎక్కడైనా ఇబ్బంది ఉంటే అధికారులు ఆ సమస్యను పరిష్కరించేలా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయబోతున్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ ఏఈఓ, గ్రామ కార్యదర్శి, పంచాయతీ కార్యదర్శిలతో సమన్వయం చేస్తూ రైతులకు ఇబ్బంది కలుగకుండా కమిటీని ఏర్పాటు చేయనున్నారు.

ఇబ్బంది లేకుండా కొనుగోలు



వానాకాలం సీజన్‌లో పంట పండించిన రైతులకు ఇబ్బంది రాకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం. త్వరలోనే కేంద్రాలు ప్రారంభిస్తాం. ఇప్పటికే మార్కెట్, రెవెన్యూ, వ్యవసాయ, సింగిల్ విండో, సివిల్‌సప్‌లై అధికారులు, రైస్‌మిల్లర్లు, లారీ ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధులతో సమావేశమయ్యాం. నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొస్తే ఇబ్బందులుండవు.
– యాస్మిన్‌బాషా, కలెక్టర్

రైతులు నాణ్యమైన మక్కలు తేవాలి

- మార్క్‌ఫెడ్ డీసీవో సత్యనారాయణ
- మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ డీసీవో సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం/మల్లాపూర్: రైతులు నాణ్యమైన మొక్కజొన్నలు తెచ్చి మద్దతు ధర పొందాలని మార్క్‌ఫెడ్ డీసీవో మాదసు సత్యనారాయణ అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నంతోపాటు మల్లాపూర్ మండలకేంద్రాల్లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. జిల్లాలో 38వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశారని, సుమారు 11లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, 14శాతం తేమ ఉన్న మక్కలను కేంద్రాలకు తెచ్చుకుని సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఇబ్రహీంపట్నంలో మార్క్‌ఫెడ్ సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి నిరేటి సురేందర్, సింగిల్‌విండో కార్యదర్శి మంత్రి సతీశ్‌కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. మల్లాపూర్‌లో ప్యాక్స్ సీఈవో పాదం భూమేశ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ఫిర్యాదు చేయడం సిగ్గుచేటు

ధర్మపురి: పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ నాయకులు ఈసీకి ఫిర్యాదు చేయడం సిగ్గుచేటని డీసీఎమ్మెస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుల దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం కేసీఆర్ పేదలు, రైతులకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఓర్వలేని నాయకులు ఇలా ఫిర్యాదు చేయడమేంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆకుల రాజేశ్, కౌన్సిలర్లు ఉన్నారు.

సారంగాపూర్‌లో..

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయిలో రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రామకిష్టు గంగాధర్, సతీష్, కొండపల్లి అజిత్‌రావు, సదాల అశోక్ ఉన్నారు.



ధర్మపురిలో కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

రాయికల్‌లో...

రాయికల్: మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుల దిష్టిబొమ్మను దహనం చేశారు. జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, ఏఎంసీ చైర్‌పర్సన్ మారంపల్లి రాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు మ్యాకల కాంతారావు, మహేశ్‌గౌడ్, మహేందర్, ఎలిగేటి అనిల్, కో–ఆప్షన్ మెంబర్ సోహెల్, శ్రీరాముల సత్యనారాయణ పాల్గొన్నారు.

బుగ్గారంలో..

బుగ్గారం: స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

పెగడపల్లి: ఎన్నికల వేళ రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ నాయకులు ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ముఖ్య నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ ఠాక్రే దిష్టిబొమ్మలను దహనం చేశారు. పేదలు, రైతులకు అందుతున్న సంక్షేమ పథకాలను నిలిపివేయాలని కోరడం చాలా విచారకరమన్నారు.

క్లుప్తంగా

భర్తపై వరకట్న వేధింపుల కేసు

కథలాపూర్(వేములవాడ): అదనపు వరకట్నం కోసం వేధిస్తుండటంతో ఓ మహిళ తన భర్తపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. కథలాపూర్ మండలంలోని భూషణరావుపేటకు చెందిన సుజాతకు మెట్‌పల్లి మండలంలోని బండలింగాపూర్‌కు చెందిన బొమ్మెన రాజేందర్‌తో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు ఉంది. ఈ క్రమంలో రాజేందర్ అదనంగా కట్నం తీసుకురావాలంటూ సుజాతను నిత్యం వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలు గురువారం పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు రాజేందర్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.

పంట ధ్వంసం చేసిన ఇద్దరిపై..

కథలాపూర్(వేములవాడ): మండల కేంద్రానికి చెందిన తీపిరెడ్డి మధుసూదన్‌రెడ్డి అనే రైతు భూమిలోకి అక్రమంగా చొరబడి, వరి పంటను ధ్వంసం చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. కథలాపూర్‌కే చెందిన బావు దశాగౌడ్, బావు మహేందర్‌లు పంట ధ్వంసం చేసి, రూ.10 వేల వరకు నష్టం చేశారని బాధితుడు గురువారం ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు దశాగౌడ్, మహేందర్‌లపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం మత్తులో యువకుడి వీరంగం

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మద్యం మత్తులో ఓ యువకుడు బతుకమ్మ ఆడుతున్న మహిళలపై బీరు చల్లి, వీరంగం సృష్టించాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండలో బుధవారం రాత్రి మహిళలు బతుకమ్మ ఆడుతున్నారు. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు మద్యం సేవించి, మోటార్ సైకిల్‌పై అక్కడికి వచ్చాడు. తన చేతిలో ఉన్న బీరును మహిళలపై చల్లాడు. వారు ఎదురు తిరగడంతో గంగాజల అనే మహిళపై దాడి చేశాడు. అడ్డుకున్న ఆమె భర్త మహేశ్‌నూ కొట్టగా గాయాలయ్యాయి. అతను మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మద్యం మత్తులో దాడికి పాల్పడిన ఆ యువకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళ ఆత్మహత్య

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని వాణీనగర్ ప్రాంతానికి చెందిన మంగళపల్లి జ్యోతి(45) ఆత్మహత్య చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ మోహన్ కథనం ప్రకారం.. మల్యాల మండల కేంద్రానికి చెందిన జ్యోతి కుటుంబం కొంత కాలంగా వాణీనగర్‌లో ఉంటోంది. పదేళ్లుగా ఆమె నడుం, కడుపునొప్పి, నరాల బలహీనతతో బాధ పడుతోంది. ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురైంది. బుధవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలి భర్త జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మోహన్ పేర్కొన్నారు.

ఇక్కడి పైసలు ఇక్కడ్నే ఖర్చు చేయాలే



సాక్షిప్రతినిధి,కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి/గోదావరిఖని: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలు సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించాలని కార్మిక సంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. ఏ పార్టీలు తమ డిమాండ్లకు పెద్దపీట వేస్తాయో.. వాటికే తాము మద్దతు పలుకుతామని తేల్చిచెప్పారు. సింగరేణి కార్మికుల ఎజెండాపై గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన 'సాక్షి చర్చావేదిక'లో అన్ని గుర్తింపు, జాతీయ, విప్లవ కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపేలా నాయకులు తమ ఆలోచనలను పంచుకున్నారు.

- కార్మిక డిక్లరేషన్ చేస్తేనే మద్దతు
- డీఎంఎఫ్‌టీ నిధులతో అభివృద్ధి చేయాలి
- స్పష్టత ఇవ్వకపోతే నోటాకే ఓటు
- కోలిండియాలో లేని హక్కులు స్వరాష్ట్రంలో సిద్ధించాయి
- 'సాక్షి చర్చావేదికలో' కార్మిక సంఘాల నాయకులు



'సాక్షి' ఆధ్వర్యంలో చర్చావేదికలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

2, 3 నెలల జీతం పన్నుకే



తెలంగాణ ఉద్యమ సమయంలో పాలక పార్టీ 50 వేల మందికి కొత్తగా ఉద్యోగాలు కల్పిస్తాం, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తాం, బొగ్గు ఆధారిత పరిశ్రమలు నెలకొల్పుతామని చెప్పి, మరిచింది. 2, 3 నెలల జీతం ఆదాయ పన్నుకే పోతోంది. – టి.శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ ఆలిండియా ప్రధాన కార్యదర్శి

పరిశ్రమలు నెలకొల్పాలి



సింగరేణి మనుగడను కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను బిచ్చగాళ్లుగా మారుస్తోంది. కేంద్రం బ్లాక్‌లను వేలం వేస్తే రాష్ట్ర సర్కారు కొని, సింగరేణికి కేటాయించాలి. బొగ్గు ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాలి. – జి.రాములు, ఏఐఎఫ్‌టీయూ నేత

హామీలతో మభ్యపెట్టవద్దు



మహిళ, బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ మాదిరిగా సింగరేణి కార్మికులకు అన్ని పార్టీలు డిక్లరేషన్ ప్రకటించాలి. తమ తమ మేనిఫెస్టోల్లో కార్మికుల సమస్యలను చేర్చాలి. ఓట్ల కోసం హామీలతో మభ్యపెట్టవద్దు. డిమాండ్స్‌పై స్పష్టత లేకపోతే నోటాకే ఓటు. – రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్

వయోపరిమితి పెంచాలి



సింగరేణి కార్మికుల సంఖ్య 1.16 లక్షల నుంచి 39 వేలకు పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిలో కొత్తగా ఇచ్చామంటున్న ఉద్యోగాలు ఎక్కడికి పోయాయి? రెండు పేర్లతో పనిచేస్తున్నావారి సమస్య పరిష్కరించాలి. వారసత్వ ఉద్యోగాల వయోపరిమితి 40 ఏళ్లకు పెంచాలి. – కె.విశ్వనాథ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కాంగ్రెస్ వల్లే తెరపైకి ప్రైవేటీకరణ



గత కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతోనే ఇప్పుడు బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చింది. కార్మికుల హక్కుల సాధనలో బీఎంఎస్ రాజీలేని పోరాటం చేస్తోంది. 11వ వేతన ఒప్పందం కోసం అహర్నిశలు కృషి చేసింది. – యాదగిరి సత్తయ్య, బీఎంఎస్ అధ్యక్షుడు

ఆదాయ పన్ను మినహాయించాలి



సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినప్పటికీ కేంద్రం పార్లమెంట్‌లో ఆమోదించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం, టీబీజీకేఎస్ నిరంతరం కార్మికుల కోసం పని చేస్తున్నాయి. – కెంగర్ల మల్లయ్య, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

రాజకీయ జోక్యం పెరిగింది



సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగింది. కార్మిక సంఘాల ఉనికి పూర్తిగా తగ్గిపోయింది. మారుపేర్ల మార్పు రెగ్యులరైజ్ చేయాలి. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలి. నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలి. – వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

బినామీ పేర్లను సవరించాలి



సింగరేణిలో బినామీ పేర్లతో పని చేస్తున్న కార్మికుల పేర్లను సవరించాలి. గోదావరితీరంలో ఉన్నా స్వచ్ఛమైన తాగు నీరందక కార్మిక కుటుంబాలు ఆస్పత్రుల పాలవుతున్నాయి. కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, కార్పొరేట్ వైద్యం అందించాలి. – తుమ్మల రాజారెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు

ప్రభావిత ప్రాంతాల్లో వసతులేవి?



సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో ఖర్చు చేయాల్సిన డీఎంఎఫ్‌టీ నిధులను సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్లో వెచ్చిస్తున్నారు. బొందల గడ్డగా మారుతున్న ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడం లేదు. సంస్థలో రాజకీయ జోక్యం పెరిగింది. – రాజన్న, సింగరేణి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు

చట్ట సవరణ చేయాలి



ప్రధాని మోదీ సింగరేణిని కార్పొరేట్ కంపెనీలపరం చేస్తున్నారు. గతంలో ఇందిరాగాంధీ బొగ్గు గనులకు జాతీయం చేయడంతో సుమారు 6 లక్షల మంది కార్మికులకు లాభం చేకూరింది. ఆదాయ పన్ను మాఫీ లేదా స్లాబ్ పెంపు అమలుకు చట్టసవరణ చేయాలి. – జనక్‌ప్రసాద్, సెక్రటరీ జనరల్, ఐఎన్‌టీయూసీ

'అడ్లూరి' గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- కాంగ్రెస్‌లో చేరిన జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ 'కటారి'
- గొల్లపల్లి వేదికగా ఐదు వేల మంది 'హస్తం'లో చేరికలు
- హాజరైన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి
- అవకాశమిస్తే అభివృద్ధి చేస్తానన్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



కటారి చంద్రశేఖర్‌రావును ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



సభకు హాజరైన జనం

గొల్లపల్లి: కాంగ్రెస్ ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యేగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపైనా ఉందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్‌రావు అన్నారు. గొల్లపల్లి మండలం గోవిందుపల్లి సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కటారి చంద్రశేఖర్‌రావు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతోపాటు ఐదు వేలకుపైగా కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కటారికి ఎమ్మెల్సీతోపాటు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కటారి చేరికతో కాంగ్రెస్‌కు నయా జోష్ వచ్చినట్లయ్యింది. ఎమ్మెల్సీ మాట్లాడుతూ మరోసారి అధికారంలోకి వచ్చేందుకు బీఆర్ఎస్ కుట్ర చేస్తోందని, మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. మూడుసార్లు ఓడిపోయినా కాంగ్రెస్‌లోనే ఉంటూ ప్రజల మధ్య ఉన్న లక్ష్మణ్‌కుమార్‌ను గెలిపించుకోవాలని కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో తనను ప్రజలు ఆదరించినా అప్పటి కలెక్టర్ శరత్ పుణ్యమాని ఓడిపోవాల్సి వచ్చిందని, అయినా ప్రజలకు అందుబాటులోనే ఉంటున్నానని, ఒక్కసారి అవకాశమిస్తే కడుపులో పెట్టుకుని చూసుకుంటానని తెలిపారు. నియోజకవర్గంలో హామీలు తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. ఒక్కసారి తనను ఆశీర్వదిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. కటారి చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ లక్ష్మణ్‌కుమార్‌ను గెలిపించేందుకే తను బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరానని వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సెక్రెటరీ శోభారాణి, ధర్మపురి, వెల్గటూర్, పెగడపల్లి, ధర్మారం, బుగ్గారం మండలాల అధ్యక్షులు దినేశ్, శైలేందర్, రాములుగౌడ్, శ్రీనివాస్, సుభాష్, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింహరాజ్ ప్రసాద్, ధర్మపురి మండల యూత్ అధ్యక్షుడు మొగిలి, అనిల్, మహిపాల్, తిరుపతి, గొల్లపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధే గెలిపిస్తుంది

- మంత్రి కొప్పుల ఈశ్వర్

గొల్లపల్లి: ధర్మపురి నియోజకవర్గంలో తను చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలే మరోసారి తనను గెలిపిస్తుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని తిర్మలాపూర్, అగ్గిమల్ల, గుంజపడుగులో ప్రజా ఆశీర్వాద యాత్ర చేపట్టారు. అడుగడుగునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. వివిధ గ్రామాల నుంచి పార్టీలో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వ పథకాలు ప్రతిఒక్కరికీ చేరాయని వివరించారు. కాంగ్రెస్ నాయకులు 70 ఏళ్లుగా మాయమాటలతో కాలంవెల్లబుచ్చారు తప్పితే అభివృద్ధి శూన్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి అండగా నిలవాలని కోరారు. జెడ్పీటీసీ జలేందర్, ఎంపీపీ నక్క శంకర్, పీఏసీఎస్ చైర్మన్ రాజ సుమన్‌రావు, వెంకటమాధవరావు, వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్, సర్పంచ్‌లు రమేశ్, ఎంపీటీసీ రాజ్యలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మంత్రి కొప్పులకు తిలకం దిద్దుతున్న మహిళ

ముగ్గురు ఆడపిల్లలు | నేనేం సంపాదించకపోతిని

- బిడ్డల పెళ్లిపై భార్యతో గల్ఫ్ కార్మికుడి ఆవేదన
- ఉరేసుకొని బలవన్మరణం
- నర్సింహులపల్లెలో విషాదం



పరమేశ్వర్ (ఫైల్)

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లెకు చెందిన ఆసం పరమేశ్వర్(45) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గౌతంపవార్ కథనం ప్రకారం.. పరమేశ్వర్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. మరో ఇద్దరు సారంగాపూర్ కస్తూరిబా బాలికల విద్యాలయంలో చదువుతున్నారు. పరమేశ్వర్ గల్ఫ్ వెళ్లి, రెండు నెలల క్రితమే వచ్చాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితిపై తరచూ భార్య విజయతో ఆవేదన చెందేవాడు. మనకు ముగ్గురు ఆడపిల్లలు.. ఎలా పెళ్లి చేయాలి.. నేను గల్ఫ్ నుంచి ఏం సంపాదించుకు రాకపోతిని అంటూ వాపోయేవాడు. దసరా సెలవులు ముగియడంతో విజయ గురువారం ఇద్దరు కూతుళ్లను కేజీబీవీలో దించి వస్తానని వెళ్లింది. కాసేపటికే పరమేశ్వర్ ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. తిరిగి వచ్చిన భార్య ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారిని పిలిచింది. వారు బలవంతంగా తలుపులు తెరిచి చూడగా అతను ఉరితాడుకు వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందికి దించి, 108కు ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి, మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

108లో ఉద్యోగావకాశాలు

జగిత్యాల: జిల్లాలో నడుస్తున్న 108 వాహనాల్లో ఈఎంటీగా పనిచేసేందుకు ఆసక్తి గల వారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్ సలీం తెలిపారు. ఆసక్తి గలవారు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఉదయం 11 నుంచి 2 గంటల వరకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు ఏఎన్ఎం/జీఎన్ఎం చేసిన వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారు జగిత్యాలలోనే పనిచేయాల్సి ఉంటుందని, వివరాలకు 91549 18093 సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ నాయకులు రైతు వ్యతిరేకులు



పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల: కాంగ్రెస్ నాయకులు రైతు వ్యతిరేకులు, అభివృద్ధి నిరోధకులని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మోతె కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యవసాయానికి మూడు గంటలు చాలంటాడు, మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధును ఆపమని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తారు.. ఇదీ వారికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధి అని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ అన్నదాతల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడితే కాంగ్రెస్ నాయకులు వాటిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రస్తుతం జిల్లాలో పంటల సాగు 20 వేల నుంచి 60 వేల ఎకరాలకు పెరిగిందని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సందీప్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్‌రావు, కౌన్సిలర్ తోట మల్లికార్జున్, నాయకులు పాల్గొన్నారు. జగిత్యాలలోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

రాయికల్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. అల్లీపూర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా కండువాలు కప్పి, ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. ఏఎంసీ డైరెక్టర్ అత్తినేని సాయిరెడ్డి, నాయకులు రత్నాకర్, ముఖీద్, రాజలింగం, వేల్పుల ప్రవీణ్, శ్రీను, జలపతి తదితరులు పాల్గొన్నారు.

అర్వింద్.. ఆర్మూర్ నుంచి ఎందుకు తప్పుకున్నవ్?

- డబ్బులు తీసుకుని రాకేశ్‌రెడ్డికి టికెట్ ఇప్పించావనే ప్రచారం
- జువ్వాడి నర్సింగరావుకు ప్రజాసేవపై నిబద్ధత లేదు
- ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశ్‌రావు



మెట్‌పల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్మూర్ నుంచి పోటీ చేసి అక్కడి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి డిపాజిట్ రాకుండా చేస్తానని తొడగొట్టి చెప్పిన నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఇప్పుడు అక్కడి నుంచి ఎందుకు పోటీ చేయడం లేదని ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశ్‌రావు ప్రశ్నించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఆర్మూర్‌లో రాకేశ్‌రెడ్డి అనే వ్యాపారి నుంచి బీజేపీ పార్టీకి, అర్వింద్‌కు వ్యక్తిగతంగా రూ.కోట్లు ముట్టడంతోనే ఆయనకు టికెట్ ఇప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయని, దీనిపై అర్వింద్ సమాధానం చెప్పాలన్నారు. రెండుసార్లు పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో డి.శ్రీనివాస్ కాంగ్రెస్ బీఫాంను గాంధీభవన్‌లో కాకుండా తన ఇంట్లో ఇవ్వడంపైనా అనేక ఆరోపణలు వచ్చాయని, ఇప్పటి వరకు వాటిపై ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు. మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు కుమారుడు నర్సింగరావుకు ప్రజలకు సేవ చేసే విషయంలో నిబద్ధత లేదన్నారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కోరుట్లను ఎంతో అభివృద్ధి చేశారని, ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆయన కుమారుడు సంజయ్‌కు ఉన్న సేవాభావాన్ని గుర్తించి ప్రజలు గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్‌పై విషప్రచారాన్ని నమ్మొద్దు



బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న సంజయ్‌కుమార్

మల్లాపూర్: బీఆర్ఎస్‌పై విపక్షాల విషప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కోరారు. గురువారం మండలంలోని రేగుంటకు చెందిన వివిధ పార్టీల నాయకులు, చిట్టాపూర్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కుమార్‌తో కలిసి కండువాలు కప్పి, ఆహ్వానించారు. బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రేగుంట నాయకులు సంజయ్ నామినేషన్‌కు రూ.21 వేలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జాగృతి యువత జిల్లా అధ్యక్షుడు గనవేణి మల్లేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ నేరెళ్ల మోహన్‌రెడ్డి, సర్పంచ్ నర్సయ్య, పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలి

మెట్‌పల్లి: నియోజకవర్గాన్ని బీఆర్ఎస్ ఎంతో అభివృద్ధి చేసిందని, మరింత అభివృద్ధికి అండగా నిలవాలని పార్టీ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ కోరారు. మల్లాపూర్ మండలంలోని రేగుంటకు చెందిన పలువురు గురువారం ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సూచించారు.

'నా జీవితం ప్రజాసేవకే అంకితం'



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్/రాయికల్: తన జీవితం ప్రజాసేవకే అంకితమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంలోని 11వ వార్డులో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీంలతో నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. రాయికల్‌లో డిగ్రీ కళాశాల, ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ ఆస్పత్రి భూమిని రక్షిస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ రుణం తీర్చుకోవాలి

కాంగ్రెస్‌తోనే తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష నెరవేరుతుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామానికి చెందిన 40 మంది యువకులు పార్టీలో చేరగా కండువాలు కప్పి, ఆహ్వానించారు. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చి, తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన కాంగ్రెస్ రుణం తీర్చుకోవాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, నాయకులు సతీశ్, సురేశ్, వేణు ఉన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను నమ్మకండి



ఇంటింటి ప్రచారం చేస్తున్న భోగ శ్రావణి

రాయికల్/సారంగాపూర్: బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను నమ్మి మోసపోవద్దని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బోగ శ్రావణి అన్నారు. గురువారం రాయికల్ మండలంలోని దావన్‌పల్లి, ధర్మాజీపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల హయాంలో సామాన్యులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందాయో గమనించాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు ఆకుల మహేశ్, పార్టీ మండల అధ్యక్షుడు వేణు, ప్రధాన కార్యదర్శి రా జశేఖర్, సింగిల్‌విండో చైర్మన్ ముత్యంరెడ్డి, ఎస్టీ సెల్ నాయకులు గంగాధర్‌నాయక్, శ్రీరాం, తిరుపతినాయక్, బిక్కు నాయక్ తదితరులు పాల్గొన్నారు. సారంగాపూర్ మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన శివాజీ యూత్ సభ్యుడు బొమ్మకంటి సత్యచరణ్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరగా కండువాలు కప్పి, ఆహ్వానించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్, నాయకులు బద్దెల గంగరాజం, బొమ్మకంటి ప్రమోద్, పడిగెల రవి తదితరులున్నారు.

'చల్మెడ'ను భారీ మెజారిటీతో గెలిపించాలి



ప్రచారం చేస్తున్న సునీల

మేడిపల్లి: భీమారం మండలంలోని మన్నెగూడెంలో చల్మెడ లక్ష్మీనరసింహారావు సతీమణి సునీల గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మీనర్సింహారావును భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అడ్వకేట్ తన్నీరు శ్రీనివాస్‌రావు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు సమలత, చల్మెడ ఆస్పత్రి మేనేజర్ కల్యాణి, సర్పంచ్ స్వప్న, నాయకులు చెన్నమనేని రవీందర్ రావు, అంగడి ఆనంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.